క్లుప్తంగా

అపార్ ఐడీ పరిశీలన



అపార్ ఐడీని పరిశీలిస్తున్న ఎంఈఓ నాగరాజు

లేపాక్షి: స్థానిక నీలం సంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో శనివారం అపార్ ఐడీ కార్యక్రమాన్ని ఎంఈఓ నాగరాజు పరిశీలించారు. ఎంఈఓ లాగిన్‌లో విద్యార్థి పేరు మార్పు, ఎంపిక అందుబాటులో ఉందన్నారు. ఎటువంటి పరిమితులు లేకుండా మరిన్ని అక్షరాలు జోడించవచ్చు. లేదా తొలగించవచ్చని ఎంఈఓ పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థికసాయం



కార్యకర్తకు నగదు అందిస్తున్న నవీన్‌నిశ్చల్

లేపాక్షి: నాయనిపల్లి పంచాయతీ ఉప్పరపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటరమణప్పకు ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్ శనివారం రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. తన కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం అందించాలని వెంకటరమణప్ప అభ్యర్థించారు. దీనిపై స్పందించిన నవీన్‌నిశ్చల్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్‌కు వెంకటరమణప్ప కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వాల్మీకి జయంతి



ఊరేగింపులో పాల్గొన్న వాల్మీకి సంజయ కుమార స్వామి

పావగడ: తాలూకాలోని కేటీ హళ్లి గ్రామంలో శనివారం విశ్వకవి మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకి సంజయ కుమార స్వామి ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగించారు. మహిళలు జ్యోతులతో ర్యాలీ చేపట్టారు.

దుకాణాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

సోమందేపల్లి: వ్యాపారులు దుకాణాలకు కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ రమేష్ బాబు సూచించారు. శనివారం మండలంలోని హోటళ్ల యజమానులతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. రాత్రి 10:30 అనంతరం హోటళ్లు తెరవకూడదన్నారు. అర్ధరాత్రి వరకు తెవరడం వల్ల రోడ్లపై వాహనాల పార్కింగ్‌తో రోడ్డు ప్రమాదాలతో పాటు చోరీలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందిచాలన్నారు. నిబంధనలు పాటించకుండా హోటళ్లలో మద్యం తాగేందుకు అనుమతిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సజావుగా దుకాణాల వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

పావగడ: పట్టణంలోని తుమకూరు రోడ్డు పక్కన ఉన్న మున్సిపల్ శాఖకు చెందిన దుకాణాలను మున్సిపల్ అధికారులు శనివారం బహిరంగ వేలం వేశారు. పాత బస్టాండ్‌లోని కింది భాగంలోని 26 దుకాణాలు, కూరగాయల మార్కెట్‌లోని 8 దుకాణాలు మొత్తం 34 దుకాణాలకు నిర్వహించిన వేలంలో 1000 మందికి పైగా వేలందారులు పాల్గొన్నారు. 11వ నంబర్ దుకాణం అత్యధిక ధర లభించింది. వేలం ద్వారా మున్సిపాలిటీకి రూ 7.8 లక్షల ఆదాయం సమకూరినట్లు మున్సిపల్ చైర్మన్ రాజేశ్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ తదితర అధికారులు, ఉద్యోగులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సదస్సుకు తరలిరండి

రొళ్ల: ఈనెల 5న విజయవాడలో తలపెట్టిన దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధుల సదస్సుకు దండోరా నాయకులు, ఉద్యమ కారులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శనివారం కోరారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ కోసం ఇచ్చిన ఆర్డినెన్స్ వెంటనే జారీ చేసి వచ్చే నెలలోపు ఎస్సీ కులగణాంకాల సేకరణ పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నష్టాల ఊబిలో రైతులు

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు రంగేగౌడ్. కొడిగానిపల్లి గ్రామం మడకశిర మండలం. ఇతను 2.50 ఎకరాలను కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేశాడు. ఇటీవల అధికంగా వర్షాలు కురవడంతో తొలగించిన వేరుశనగ పొలంలోనే తడిసిపోయింది. కాయల్లో మొలకలు వచ్చి నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ కట్టె తడిసిపోయి నల్లగా మారుతోంది. ఈ అధిక వర్షాలతో వేరుశనగ దెబ్బతి



న్నట్లు చెబుతున్నాడు. రూ.80 వేల వరకూ నష్టం వచ్చింది. ప్రభుత్వమే అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతున్నాడు.

- ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు వర్షార్పణం
- పొలాల్లోనే కుళ్లిపోయిన వేరుశనగ కట్టె
- కరువు మండలాల జాబితాలో మడకశిర నియోజకవర్గంలోని మండలాలకు దక్కని చోటు
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న రైతన్నలు

మడకశిర రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. పశుగ్రాసం కూడా దెబ్బతినడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మడకశిర మండలంలో 3,989 హెక్టార్లు, రొళ్ల 3,200 హెక్టార్లు, అమరాపురం 4,400 హెక్టార్లు, గుడిబండ 4,300 హెక్టార్లు, అగళి 2,350 హెక్టార్ల చొప్పున వేరుశనగ సాగైంది. వేరుశనగ ఊడలు దిగే సమయంలో వరుణ దేవుడు కరుణ చూపలేదు. వర్షం రాకపోవడంతో ఎండుముఖం పట్టిన పంటను రైతులు ఇబ్బందులు పడుతూ తొలగించుకున్నారు. అల్పడీనం ప్రభావంతో పంటను తొలగించిన రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు వేరుశనగ కట్టె పొలంలోనే తడిసిపోయింది. వేరుశనగ కుళ్లిపోయి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాయలు మొలకెత్తుతుండటంతో వేరుశనగ కాయలను పొలంలోనే తొలగించుకున్నారు. వేరుశనగ కట్టె కూడా కుళ్లిపోయి పశుగ్రాసం కూడా పనికి రాకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

పడిపోయిన వేరుశనగ ధర..

కాస్తో కూస్తో చేతికందిన వేరుశనగ కాయలకు ఆశించిన ధర లభించడం లేదు. వేరుశనగను నిల్వ ఉంచుకోవడానికి అవకాశం లేకపోవడంతో వేరుశనగ కాయలను తక్కువ రేటుకే అమ్ముకుంటున్నారు. పశుగ్రాసమైన దొరకతుందని పంటను తొలగించారు. తొలగించినప్పటి నుంచి వర్షాలు కురువడంతో పొలంలోనే పంట తడిసి కుళ్లి పోయింది. కుళ్లి నల్లభారీన కాయలను తొలగించుకున్న ధర లేకపోవడంతో కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రారంభంలో రూ.7 వేల ధర ఉండేది. ప్రస్తుతం వేరుశనగ కాయల నాణ్యతను బట్టి క్వింటాల్ రూ.5 వేల నుంచి రూ.5,500 ధర పలుకుతోంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కూడా కల్పించక పోవడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పంటలు కళ్ల ఎదుటే దెబ్బతిన్నా.. ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించకపోవడం దుర్మార్గమని మండిపడుతున్నారు. ప్రభుత్వం రైతులపై చిన్న చూపు వీడి వెంటనే కరువు మండలాల జాబితాలో చేర్పించాల్సిన అవసరం ఉంది. అదే విధంగా రబీ పంటల సాగుకు అన్ని రకాల విత్తనాలను ఉచితంగా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కొడిగానిపల్లి వద్ద పొలంలో వేరుశనగ కాయలను తొలగించుకుంటున్న దృశ్యం

పొలంలోనే కుళ్లిపోయింది



విస్తారంగా కురిసిన వర్షాలకు తొలగించిన వేరుశనగ తడిసిపోయింది. వేరుశనగ కట్టె కుళ్లిపోయి కాయలు మొలకెత్తి నల్లగా మారిపోయ్యాయి. రూ.20 వేలు అప్పు చేసి ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేశాను. వర్షాలతో పంట మొత్తం దెబ్బతింది. చేసిన అప్పులకు వడ్డీ చెల్లించడానికి కూడా గిట్టుబాటు కావడం లేదు. పశుగ్రాసం దొరకదు. చేతికందిన వేరుశనగకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించ లేదు. ఇంతా పంట నష్టం జరిగినా ప్రభుత్వం మడకశిరను కరువు మండలంగా ప్రకటించకపోవడం చాలా బాధకరం. ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి.

– మల్లికార్జున, కేతేపల్లి, మడకశిర మండలం

'మెరుగైన వైద్య సేవలందించాలి'



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు నారాయణప్ప

అమరాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందించాలని ఎంపీటీసీ సభ్యుడు నారాయణప్ప, కో–ఆప్షన్ సభ్యుడు రసూల్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మండల స్థాయిలో జరుగుతున్న అభివృద్ధిని శాఖల వారీగా అధికారులు వివరించాలన్నారు. ఏఓ మంజునాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అంధిస్తున్న పథకాలను వివరించారు. పీహెచ్‌సీ డాక్టర్ మాట్లాడుతుండగా సభ్యులు పలు సమస్యలు లేవనెత్తారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు ఉన్నా సక్రమంగా విధులకు హాజరు కావడం లేదన్నారు. చికిత్స కోసం వచ్చిన వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. డబ్బు వెచ్చించి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి చికిత్సలు చేయించుకుంటున్నారని వాపోయారు. ఇదే విషయాన్ని గత సమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దృష్టికి తీసుకెళ్లామన్నారు. డాక్టర్‌ను మార్చుతామని చెప్పి.. ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రామారావును కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు శాఖల వారీగా ప్రగతి వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి ప్రకాష్, జెడ్పీటీసీ స్వారక్క, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం టౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ప్రిన్సిపాల్ జియావుల్లా ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదివి, తల్లిదండ్రులు, విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా సమాజం కోసం పాటు పడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలయేసు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శౌరిరెడ్డి, సీనియర్ అధ్యాపకులు సుందరేష్, తన్వీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ



పెద్దలను స్మరిస్తూ ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

హిందూపురం: సమాధుల తోటలో శనివారం క్రైస్తవులు సమాధుల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా సమాధులను పూలతో అలంకరించి ప్రార్థనలు చేపట్టారు. ఈసందర్భంగా మతపెద్దలు పండుగ ప్రాముఖ్యతను తెలియజేశారు. కిరణ్ మోహన్, సంఘ కమిటీ సెక్రెటరీ పాల్, జయరాజ్, జైపాల్, ఏలియాస్ రాజు బ్రాంచ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇమ్యునైజేషన్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారి

రొద్దం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేంద్రనాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్ వినియోగిస్తున్న విధానాన్ని పరిశీలించి, ఫార్మసిస్ట్ చాంద్‌ను అడిగి తెలుసుకున్నారు. వీఎల్ఎఫ్ రికార్డును పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్ శ్రవన్‌తో ల్యాబ్ పరీక్షలపై ఆరా తీశారు. డాక్టర్ భాగ్యలక్ష్మి, జిల్లా ప్రోగ్రాం అధికారి నాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ చంద్రానాయక్, సూపర్‌వైజర్ గిరినాథ్‌రావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

హిందూపురం: ముక్కిడిపేట పాత ఎస్సీ బాయిస్ గవర్నమెంట్ హాస్టల్‌లోని స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎలక్ట్రీషన్, ల్యాండ్ సర్వేయింగ్, ప్లంబర్ విభాగాల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(ఎన్ఏసీ) అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్ఏసీ, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరిగే శిక్షణకు 16 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ల్యాండ్ సర్వేయర్ కోర్సుకు ఇంటర్ పాస్, ఎలక్ట్రిషన్ కోర్సుకు పది పాస్, ప్లంబర్ కోర్సుకు పది చదివినవారు అర్హులని పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 8లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9052901657, 9110550779 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భజన మండలి ప్రారంభం

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురంలో శనివారం సత్యసాయి భజన మండలిని ప్రారంభించారు. భజన మండలి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గ్రామంలో ఊరేగింపు, బాబా చిత్రపటం ఊరేగింపు, నగర సంకీర్తన, ద్వీప ప్రజ్వలన భక్తులతో సమావేశం నిర్వహించారు. బాబా గురించి, బాలవికాస్, సత్సంగం, ఆధ్యాత్మిక సేవలు తదితర వాటిపై జిల్లా అధ్యక్షుడు వివరించారు.

పిల్లలను ఉన్నతంగా చదివించాలి



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: బీసీలు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం స్థానిక ఫైర్ ఆఫీస్ సమీపంలోని ప్రభుత్వ భవనంలో హాస్టల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మతులకు రూ. 20 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. రొద్దం–1 ఎంజేపీ స్కూల్‌కు ప్రభుత్వం నుంచి రూ. 22.50 కోట్లు మంజూరయినట్లు మంత్రి సవిత తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. త్వరలో సోమందేపల్లిలో బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పెనుకొండలో రూ. 6 కోట్లతో టీటీడీ కళ్యాణ మంటపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు గుంతలను పూడ్చే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న డాక్టర్ శివనంద

అగళి: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులందరికీ నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రేణుక అధికారులకు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రేణుక అన్ని శాఖల అధికారులతో విడివిడిగా సమీక్ష నిర్వహించారు. కేజీబీవీలో పురుగులతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. రుచికరమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు శాఖల వారీగా ప్రగతి వివరాలను వెల్లడించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ప్రజా ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

రొద్దం: మోపుర్లపల్లిలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం బోయలు వాల్మీకి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహర్షి చిత్ర పటాన్ని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. బోయల ఆరాధ్యదైవమైన వాల్మీకి విగ్రహానికి మహిళలు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

హిందూపురం: సడ్లపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి రూ.25,116, బసవనపల్లి నారాయణరెడ్డి రూ.10,116, సడ్లపల్లి శ్రీరామిరెడ్డి రూ.11,116 చొప్పున విరాళం అందజేశారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందించారు.

నేడు విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ

అమరాపురం: స్థానిక హేమావతి, మడకశిర ప్రధాన కూడలి మధ్య ఆదివారం ఉదయం 10:30 గంటలకు కెంపేగౌడ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ నిర్వహిస్తున్నట్లు మండల కుంచిటి వక్కలిగ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.


పెన్నానదికి చేరిన పరిగి చెరువు నీరు



రొద్దం పెన్నానదికి చేరిన పరిగి చెరువు నీరు

రొద్దం: మండల కేంద్రం సమీపంలో ప్రవహిస్తున్న పెన్నానదిలోకి శనివారం సాయంత్రం పరిగి చెరువు మరువపారి కలిసింది. వరద నీరు పెద్ద ఎత్తున పెన్నానదిలోకి చేరడంతో గ్రామస్తులు పెన్నా ప్రవాహాన్ని చూడడానికి ఎగపడ్డారు. పెన్నానది పారుతుండంతో పెన్నానదిలో ఫిల్టర్ బోర్లు వేసుకున్న రైతులకు ఫిల్టర్ బోర్లలో ఏడాది పాటు సమృద్ధిగా నీరు వస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వంట సామగ్రి అందజేత



వంటసామగ్రి అందిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యాన్నదానానికి అవసరమైన వంటసామగ్రిని వైష్ణవి హాస్పిటల్ నిర్వాహకుడు డాక్టర్ అనిల్ కుమార్ శనివారం అందజేశారు. కర్ణాటకలోని కోలార్ పూల మార్కెట్‌కు చెందిన సుగుటూరు వరదప్ప 4 బియ్యం ప్యాకెట్లు అందించారు. సమితి సభ్యులు మాట్లాడుతూ 107 రోజులుగా నిత్యం 250 మందికి తగ్గకుండా అన్నదానం చేస్తున్నామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

గుడిబండ: సైబర్ నేరాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కెనరా బ్యాంక్ మేనేజర్ మల్లయ్య సూచించారు. శనివారం మండల పరిధిలోని ఫళారం గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. ఖాతాదారులు అప్రమత్తంగా ఉండి, బ్యాంక్ వివరాలు గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

లేపాక్షిలో పర్యాటకుల సందడి



ఆలయ తూర్పు ద్వారం వద్ద నిలిచిపోయిన వాహనాలు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి సందర్శనకు భక్తులు పోటెత్తారు. పెద్దసంఖ్యలో భక్తులు వీరభద్ర స్వామి, దుర్గాదేవి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ సమీపంలో ఉన్న అన్నదాన సేవా ట్రస్ట్ భక్తులు, పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. ఆలయ తూర్పుద్వారం సమీపంలో వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి.

పాల సంఘం ఎన్నికలకు నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న చన్నమల్లయ్య

పావగడ: స్థానిక తుమకూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ స్థానానికి ఈనెల 10 ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక జేడీఎస్, బీజేపీ కూటమి నుంచి మాజీ తుముల్ డైరెక్టర్ చన్నమల్లయ్య శనివారం నామినేషన్ దాఖలు చేశారు. తుమకూరులోని జిల్లా ఉప విభాగాధికారుల కార్యాలయంలో ఆయన తన నామినేషన్ పత్రాన్ని అధికారులు అందజేశారు. కార్యక్రమంలో జేడీఎస్ సీనియర్ నేత తిమ్మారెడ్డి, ఎస్ఏ ఈరణ్ణ, బలరామరెడ్డి, ఎస్‌కే రెడ్డి, రామాంజిన రెడ్డి, గంగాధర నాయుడు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పూజలు



అలంకరణలో ఆంజనేయస్వామి

గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు గ్రామంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. తొలుత ఆంజనేయ స్వామి విగ్రహానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, గంగాజలంతో అభిషేకం చేపట్టారు. అనంతరం మారేడు పత్రంతో ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

హిందూపురం: కార్తీకమాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని పేట వేంకటరమణస్వామి దేవస్థానంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీదేవి భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి మంగళవాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు.

ఎస్ఐకి సన్మానం

రొళ్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్న రాజశేఖర్‌ను జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ధర్మవరం సబ్ డివిజన్ ముదిగుబ్బ సర్కిల్ పరిధిలోని పట్నం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. శనివారం ఎస్ఐ రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. తొలుత స్వామి ప్రతిమను గంగాజలంతో శుద్ధి చేసి అభిషేకం చేపట్టారు. అనంతరం వెండి ఆభరణాలు, పూలతో అలంకరించి మహామంగళారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. కొందరు భక్తులు ఆలయ ఆవరణలో వంటకాలు చేసి భక్తులకు అన్నదానం చేశారు.